# 31

# రాజ్య విత్తనమును విత్తుట

## (13:1-23)

విత్తువాని గూర్చిన ఈ ఉపమానము యేసు పరిచర్యలో అతి ముఖ్యమైన ఒక పరిణామమును ఖచ్చితముగా ముద్రించినది.

### ఉపమానము–దాని విషయములు (13:1–9)

**[1]ఆ దినమందు యేసు ఇంటనుండి వెళ్లి సముద్ర తీరమున కూర్చుండెను. [2]బహు
జనసమూహములు తన యొద్దకు కూడివచ్చినందున ఆయన దోనెయెక్కి కూర్చుండెను. ఆ
జనులందరు దరిని నిలచియుండగా. [3]ఆయన వారిని చూచి చాల సంగతులను ఉపమాన
రీతిగా చెప్పెను. ఎట్లనగా–ఇదిగో విత్తువాడు విత్తుటకు బయలు వెళ్లెను. [4]వాడు విత్తుచుండగా
కొన్ని విత్తనములు త్రోవప్రక్కను పడెను; పక్షులు వచ్చివాటిని మ్రింగిమేసెను. [5]కొన్ని చాల
మన్ను లేని రాతినేలను పడెను; అక్కడ మన్ను లోతుగా ఉండనందున అవి వెంటనే మొలిచెను
గాని. [6]సూర్యుడు ఉదయించి నప్పుడు అవి మాడి వేరులేనందున ఎండిపోయెను. [7]కొన్ని
ముండ్లపొదలలో పడెను; ముండ్లపొదలు ఎదిగి వాటిని అణచివేసెను. [8]కొన్ని మంచి నేలను
పడి, ఒకటి నూరంతలుగాను, ఒకటి అరువదంతలుగాను, ఒకటి ముప్పదంతలుగాను
ఫలించెను. [9]చెవులుగలవాడు వినునుగాక అని చెప్పెను.**

**వచనములు 1, 2.** ఈ ప్రారంభ వచనములు అధ్యాయములోని అనేక ఉపమానములకు చక్కని సందర్భమును సమకూర్చుచున్నవి. **యేసు** "జనసమూహములతో మాటలాడుచుండిన" (12:46) కపెర్నహూములోని **ఇంట** నుండి బయల్దేరి, **సముద్ర తీరమున** కూర్చుండెను. కపెర్నహూ ము సరిగ్గా గలిలయ సముద్ర తీరముపై నున్నది. ఒకేసారి అనేకులతో మాటలాడగలుగునట్లు ఆయన ఇచ్చట నిలచియుండవచ్చును. ఆయన సముద్ర తీరమున నుండినప్పుడు **బహు జనసమూహములు తన యొద్దకు కూడివచ్చెను.** యేసు ఆ ప్రాంతములోను అనేక పట్టణములలోను గ్రామములలోను బోధించుచుండెను (లూకా 8:1). ఈ సమయంలో, "బహు జనసమూహము కూడి ప్రతి పట్టణము నుండి ఆయన యొద్దకు వచ్చుచుండెనని" లూకా చెప్పుచున్నాడు (లూకా 8:4; NKJV).

యేసు ఒక చిన్న **దోనెలోనికి** వెళ్లి కూర్చుండవలసిన అవసరత ఏర్పడునంతగా జనసమూహము కూడివచ్చియుండెను. ఆయన కూర్చుండి యుండిన దోనె తీరము నుండి కొంచెము లోతునకు వెళ్లినప్పుడు, అదొక సహజ నాటకశాల అయ్యింది, గనుక **తీరము వెంబడి కూడి యుండిన** వారందరు ఆయన బోధలు వినుటకు సులభమయ్యింది. ఈ ప్రసంగము చేయబడిన సాంప్రదాయకమైన స్థలము "ఉపమానముల పుష్కరిణి" ("the Cove of the Parables") అని పిలువబడినది.[1] ఒకరు ఈ పుష్కరిణి కేంద్రములో

నిలువబడి ప్రసంగించుచుండినప్పుడు వేల కొలది జనులు వినగలుగుచుండిరి దోనె, యేసు ప్రసంగించుటకు ఒక చక్కని ప్రసంగవేదిక అయ్యింది. అది యూదా మత బోధకుల వాడుకయై యుండినట్లే ఆయన బోధింప నుద్దేశించి దోనె యెక్కి **కూర్చుండెను** (5:1; 15:29; 24:3; 26:55).

**వచనము 3.** ఆయన బోధింపనారంభించి, **వారికి చాల సంగతులను ఉపమాన రీతిగా చెప్పెను**. యేసు ఇదే బోధనా విధానమును ఇతర సందర్భములలో సహితము ప్రయోగించినప్పటికిని, "ఉపమానము" అను పదమును ఉపయోగించుట ద్వారా మత్తయి ఈ విషయమును గుర్తించుట ఇదే తొలి సారి. యేసు నివేదించిన తొలి "రాజ్యమును గూర్చిన ఉపమానము" **విత్తువాని** గూర్చినదై యున్నది. ఈ ఉపమానము మూడు సమదృక్పథ సువార్తలలోను కలదు (మత్తయి 13; మార్కు 4; లూకా 8). ఉపమానములు చెప్పుచుండగా, ఆయన తన శ్రోతలకు సుపరిచితమైన సన్నివేశములనే, మరి ముఖ్యంగా వ్యవసాయము మరియు కాపరత్వ సాదృశ్యములను, యేసు వర్ణించాడు.

"విత్తువాడు" **విత్తుటకు బయలు వెళ్లెను**. అతడు చుట్టుప్రక్కల సమీపమున నుండిన పొలములో విత్తనములను విత్తుటకు తాను నివసించుచుండిన గ్రామమును లేదా పట్టణమును విడచిపెట్టి వెళ్లాడు. విత్తువారు సాధారణంగా తెలతెలవారుచుండగనే బయలుదేరి వెళ్లి, దినమంత శ్రమించి, పట్టణ ప్రాకారము లోపల నుండు భద్రత నిచ్చు వారి ఇళ్లకు సాయంకాలము తిరిగి వచ్చెదరు (న్యాయాధిపతులు 19:16–21; రూతు 2:2, 17, 18). ప్రధానంగా గోధుమ గింజలు నవంబర్/డిసంబర్ మాసములలో విత్తబడి, ఏప్రిల్/మే మాసములలో పంట కోయబడినది.

వ్యవసాయదారులు విత్తనములను విత్తుటకు (అవి విస్తరించిన ప్రదేశములో పడునట్లు) "వెదజల్లుట" యేసు విధానమును అనుసరించుచుండిరి. వారు విత్తుచుండినప్పుడు, విత్తనములున్న సంచులను భుజములపై వేసుకొని, పొలము గుండా నడుచుచు, చేతి నిండా తీసికొనబడిన విత్తనములను పొలములో గాలిలోనికి విసరుచున్నట్లుగా వెదజల్లుచుండిరి. ఇలా విత్తినప్పుడు, విత్తనములు ఎక్కడ పడుచుండినవో ఖచ్చితంగా తెలియదు. కాకపోతే మంచి పంట పండునట్లు చాలినన్ని విత్తనములు మంచి నేలలో పడునని వ్యవసాయదారులు ఎరిగి యుండిరి. సరైన వాతావరణములో, అవి మొలకెత్తి వానికి మంచి పంట నిచ్చుచుండినవి. ఈ ఉపమానములో, విత్తువాడు మరియు విత్తనములు స్థిరాంకములై యున్నవి, నేలలు మాత్రమే మారుచున్నవి.

**వచనము 4.** యేసు మొదట **త్రోవ ప్రక్కన పడిన విత్తనమును** పేర్కొనుచున్నాడు. "త్రోవ" అని అర్థమిచ్చునట్లు అనువదింపబడిన గ్రీకు పదము (*hodos*) "మార్గము" అని అర్థమిచ్చుచున్న ఒక జాతివాచక పదమై యున్నది. అది ఒక "రహదారి"ని, "రోడ్డు"ను, లేక "బాట"ను సూచింపవచ్చును. ప్రస్తుత సందర్భములో, అది ఒక "దారి"ని (NIV; NRSV). సూచించుచున్నట్లున్నది. పాలస్తీనాలోని ద్రాక్షా తోటల కాపుదల నిమిత్తము వాటి చుట్టూర తరుచుగా రాతి గోడలు కట్టబడినవి లేదా కంచెలు నాటబడినవి (సంఖ్యాకాండము 22:24; సామెతలు 24:30, 31; యెషయా 5:5), అయితే పంట చేలు కంచే వేయబడి యుండలేదు (12:1 చూడు). దానికి బదులుగా, అవి ఇరుకైన కాలి బాటల చేత వేరుచేయబడినవి, మరియు వాటి సరిహద్దులు పొలిమేర రాళ్ల చేత గుర్తుపెట్టబడినవి (ద్వితీయోపదేశకాండము

19:14; 27:17; యోబు 24:2; సామెతలు 22:28; 23:10). ఈ కాలి బాటలు పెక్కు మంది ప్రజలు యేళ్ల తరబడి కాలినడకన వెళ్లుటనుబట్టి అణగద్రొక్కబడినవి. కాబట్టి, వాటి ప్రక్కన ఉండిన నేల విత్తబడిన విత్తనము చొచ్చుకొనిపోలేనంతగా గట్టిబడి యుండినవి. గనుక సహజంగానే విత్తబడిన విత్తనము నేల పైపైనే ఉండును, తత్ఫలితంగా పక్షుల వేటకు ఎరయైనవి. వ్యవసాయదారుడు వాటిని తీసి మరొక చోట మంచి సారవంతమైన నేలలో విత్తక మునుపే **పక్షులు** వాటిని సులభముగా మ్రింగివేయగలుగుచుండెను.

**వచనములు 5, 6.** రెండవది, కొన్ని విత్తనములు **మన్నులేని రాతినేలను** పడెను. పాలస్తీనాలో ఇదొక మామూలు విషయమే. ఏలయనగా, అనేక ప్రాంతములలో, సున్నపు రాళ్లుండిన నేలల ఒడ్డులు కొన్ని అంగుళముల వరకే మట్టిచేత కప్పబడి యుండినవి. క్రీస్తు కాలములో, యోర్దాను నది మరియు గలిలయ సముద్ర తీరము వెంబడి ఉండిన కొన్ని మైదానములు మరియు చదునైన నేలను మినహాయిస్తే, పంటలను విస్తారమైన ప్రదేశములలో పండించుటకు చాలినంత నేల అందుబాటులో ఉండుట అంతంత మాత్రమే.

నేలమట్టి లోతు లేనిదైనందువలన, మొక్కలు త్వరగా **మొలకెత్తుచుండినవి**. ఏదిఏమైనా, **సూర్యుడు** ఉదయించిన తదుపరి, ఎండ తీవ్రతనుబట్టి అని **ఎండిపోయినవి.** ఇటువంటి మొక్కల ఆకుల మొదట ఆరోగ్యవంతమైనవి మరియు బలమైనవిగా అగుపించినవి; కాని నీళ్లు మరియు సారమైన పోషణ సమకూర్చగల లోతైన వేళ్లు లేనందువలన, మొక్కలు త్వరగా ఎండిపోవుచుండినవి. "చెమ్మలేనందున ఎండిపోయెనని" లూకా 8:6 చెప్పుచున్నది.

**వచనము 7**. మూడవది, కొన్ని విత్తనములు **ముండ్లపొదలలో పడినవి** (యోబు 31:40; యిర్మీయా 4:3; మత్తయి 7:16; హెబ్రీయులకు 6:8 చూడు). ఇచ్చట "ముండ్లు" అని అర్థమిచ్చుటకు వాడబడిన గ్రీకు పదము (*akantha*) "ముండ్ల పొదలను" సూచించుచున్నది. స్వాభావికముగా ముండ్ల పొదలు మొలచిన నేలలో ఈ విత్తనము కూడ మొలచినది. ముండ్ల పొదలు–ఆ నాడైనా, ఈ నాడైనా–వాటి ఎదుగుదలలో అత్యంత శక్తిశాలియైనవిగా ఉంటాయి. ఒకడు వాని భూమిని చదునుచేయుటకు ఎంతో ప్రయాసపడవలసి యుండును; కాని వాడు దానిని అలక్ష్యము చేసినట్లయితే, ముండ్లపొదలు వెంటనే మూకుమ్మడిగా మొలుచును (సామెతలు 24:30–34). ఒకడు వాని పంట భూమిని శుభ్రము చేయుటకు ముండ్ల పొదలను వాటి కూకటి వేళ్ళతో పెల్లగించవలసి యుండును, అంతే గాని పైపైన కత్తిరించుట పనిచేయదు. కొడవలితో కోసినట్లుగా కోసివేసినట్లయితే, అవి మరలా వెంటనే ఎదుగును. ఈ సందర్భములో, మంచి మొలకలు ముండ్లపొదలతో పాటు మొలకెత్తినవి, గనుక చివరకు **ముండ్ల పొదలు వాటిని అణచివేసినవి**. కాబట్టి చాలినంత పోషణ, సూర్యరశ్మి, మరియు గాలి అందనందు వలన మంచి మొక్కలు సహితము మరణించినవి.

**వచనము 8.** నాలుగవది, యేసు చెప్పుచుండిన కథలోని విత్తనములు కొన్ని **మంచి నేలను పడి, ఒకటి నూరంతలుగాను, ఒకటి అరువదంతలుగాను, ఒకటి ముప్పదంతలుగాను ఫలించెను**. క్రెయిగ్ ఎస్. కీనర్ చెప్పుచున్నట్లు, ఆ ప్రాంతంలో, సగటున విత్తబడిన మొత్తము విత్తనములలో ఏడున్నర మొదలుకొని పది శాతము వరకు దిగుబడి నిచ్చుచుండినవి.[2] ఈ లెక్కల ప్రకారము, క్రీస్తు పేర్కొనిన వెవ్వేరు దిగుబడులు, అవి అద్భుతకరమైనవే అయినా, అవి అసాధారణమైనవై యున్నవి.[3] పూర్వీకుల కాలములో, ఇస్సాకు, దేవుని చేత దీవింపబడినవాడై, నూరంతల పంట కోసికొన్నాడు (ఆదికాండము

26:12). ఇదే విధమైన ఎదుగుదలను అటుతరువాతి యూదుల రచనలు ప్రస్తావించినవి.[4] ఇచ్చట పేర్కొనబడిన సమృద్ధియైన దిగుబడులు ఫలదాయకము కాని నేలల్లో విత్తబడి వృథా అయిన పంట యొక్క నష్టమును పూరించును.

**వచనము 9. చెవులుగలవాడు వినునుగాక** అని చెప్పుచు యేసు ముగించాడు (11:15పై గల వ్యాఖ్యానము చూడు). ఆయన ఉపదేశించుచుండిన బోధలు వినుచుండిన శ్రోతలు ఈ ఉపమానము యొక్క అర్థమును గ్రహించవలెనని ఆయన ఆశించుచుండెను. ఈ మందలింపు 43వ వచనంలో మరొక పర్యాయము చెప్పబడినది. ఈ ఉపమానము గూర్చి యేసు చెప్పిన వివరము 13:18-23లో ఉన్నది.

## ఉపమానము–దాని ఉద్దేశము (13:10–17)

**10తరువాత శిష్యులు వచ్చి–నీవు ఉపమానరీతిగా ఎందుకు వారితో మాటలాడుచున్నావని ఆయనను అడుగగా, ఆయన వారితో ఇట్లనెను. 11–పరలోకరాజ్య మర్మములు ఎరుగుట మీకు అనుగ్రహింపడియున్నది గాని వారికి అనుగ్రహింప బడలేదు. 12కలిగినవానికే యియ్యబడును, వానికి సమృద్ధి కలుగును; లేనివానికి కలిగినదియు వానియొద్దనుండి తీసి వేయబడును. మరియు–వారు చూచుచుండియు చూడరు, వినుచుండియు వినకయు గ్రహింపకయు నున్నారు. 13-15ఇందునిమిత్తము నేను ఉపమానరీతిగా వారికి బోధించుచున్నాను.**

> **ఈ ప్రజలు కన్నులార చూచి, చెవులారా విని, హృదయముతో గ్రహించి మనస్సు త్రిప్పుకొని నావలన స్వస్థత పొందకుండునట్లు వారి హృదయము క్రొవ్వినది, వారి చెవులు వినుటకు మందము లైనవి, వారు తమ కన్నులు మూసికొనియున్నారు గనుక మీరు వినుటమట్టుకు విందురుగాని గ్రహింపనే గ్రహింపరు, చూచుటమట్టుకు చూతురు గాని యెంత మాత్రమును తెలిసికొనరు.**

**అని యెషయా చెప్పిన ప్రవచనము వీరి విషయమై నెరవేరుచున్నది. 16అయితే మీ కన్నులు చూచుచున్నవి గనుక అవి ధన్యములైనవి, మీ చెవులు వినుచున్నవి గనుక అవి ధన్యములైనవి. 17అనేక ప్రవక్తలును నీతిమంతులును మీరు చూచువాటిని చూడగోరియు చూడకపోయిరి, మీరు వినువాటిని వినగోరియు వినకపోయిరని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను.**

**వచనము 10.** అటుతరవాత **శిష్యులు** యేసు యొద్దకు వచ్చి, **నీవు ఉపమానరీతిగా ఎందుకు వారితో మాటలాడుచున్నావని** ఆయనను అడిగారు. ఆయన ఇంటిలో ఉండినప్పుడు శిష్యులు యేసును ఈ ప్రశ్న అడిగియుందురు (13:36). "ఆయన ఒంటరిగా ఉన్నప్పుడు" ఆయనను వెంబడించుచుండినవారు ఈ ప్రశ్న ఆయనను అడిగారని మార్కు 4:10 చెప్పుచున్నది.

యేసు అంతకు మునుపు కూడ ఉపమానములను ఉపయోగించాడు, కానీ ఇచ్చట ఉపయోగించినంత సవిస్తరంగా కాదు. యేసు తన ఉపదేశ విధానములో చేసిన తేడాను శిష్యులు గుర్తించారు, గనుక వారు అబ్బురపడ్డారు. యేసు తెలియజెప్పిన ఉపమానములు

అర్థంచేసికొనుటకు ఎల్లప్పుడు అంత సులభంగా లేకుండినవని వారడిగిన ప్రశ్న సూచించుచున్నది.

**వచనము 11.** అందుకు యేసు, **పరలోకరాజ్య మర్మములు ఎరుగుట మీకు అనుగ్రహింపబడియున్నది** అని ప్రత్యుత్తరమిచ్చాడు. "మర్మము" మరియు "రాజ్యము" అను మాటలు, దేవుని నిత్య రాజ్యము రానున్నదని ప్రవక్త తెలియజెప్పుచుండిన సందర్భములో దానియేలు 2వ అధ్యాయంలో కలిసి అగుపించును (దానియేలు 2:18, 19, 22, 23, 27, 30, 44, 47). "మర్మము" అని అనువదింపబడిన గ్రీకు పదము (*mustērion*) ఒకప్పుడు మరుగున ఉండి, ఇప్పుడు బయలుపరచబడిన విషయమును సూచించుచున్నది. ఇంకా నిర్దిష్టముగా చెప్పుకొన్నట్లయితే, అది క్రీస్తు యేసు బలియాగము మరియు ఆయన సంఘ స్థాపన ద్వారా సమస్త మానవుల (యూదులు మరియు అన్యజనులు) రక్షణార్థము గల దేవుని తెరవెనుక నున్న ప్రణాళికా సన్నివేశమును సూచించును (రోమీయులకు 16:25, 26; ఎఫెసీయులకు 3:4–12; కొలొస్సయులకు 1:25–27).

"రాజ్యమర్మములను" బయలుపరచుట దేవుని కృప యొక్క ఫలితమై యున్నది. ఏదిఏమైనా, యేసు బోధలు వినుటకు అయిష్టపడుచుండిన వారు ఆ బోధలను అర్థంచేసికొనుటకు వారికి అనుగ్రహింపబడిన తరుణమును కోల్పోయ్యారు. యేసే రాజ్యమును స్థాపించుటకు వచ్చిన మెస్సీయాయై యున్నాడని శిష్యులు విశ్వసించి యుండిరి గనుక, వారు ఆయన చెప్పుచుండిన ఉపమానములను గ్రహించుటకు ఎక్కువ సమర్థవంతులై యుండిరి.

**వచనము 12.** ఆయన శిష్యులకు ఒక ప్రోత్సాహకమై యుండునట్లు. యేసు, **కలిగినవానికే, ఇయ్యబడును, వానికి సమృద్ధి కలుగును; లేనివానికి, కలిగినదియు వాని యొద్ద నుండి తీసివేయబడునని** సెలవిచ్చాడు (25:29; మార్కు 4:25; లూకా 8:18; 19:26 చూడు). యేసు చెప్పుచుండిన ఉపమానముల సందేశమును అర్థంచేసికొనినవారికి మరి ఎక్కువ లోతైన ఆధ్యాత్మిక సత్యముల అవగాహన కొరకైన తెలివి అనుగ్రహింపబడును. ఆధ్యాత్మిక విచక్షణ లేనివారు యేసు ఉపమానముల అర్థమును గ్రహించలేరు. గ్రహించగల సామర్థ్యము వారికుండినది, కాని వారు అందుకు సిద్ధంగా లేరు. ఈ హేతువునుబట్టి, యేసు, వారికుండిన ఆధ్యాత్మిక తెలివి వారి నుండి తీసివేయబడునని చెప్పాడు.

**వచనములు 13–15.** యేసు ఉపదేశములను వినుటకు లేదా అంగీకరించుటకు అయిష్టపడుచుండినవారికి ఆయన సందేశ మర్మములు బయలుపరచబడకుండునట్లు ఆయన వారికి **ఉపమానముల ద్వారా** ఉపదేశించుచుండెను. వారి హృదయములు కఠినమైనవైనందు వలననే వారు ఆయన ఉపదేశములను గ్రహించలేకుండిరి. ఆయన సందేశముల యెడల వారు ప్రదర్శించుచుండిన అనంగీకారమును యేసు **ప్రవక్తయైన యెషయా పలికిన ప్రవచన** నెరవేర్పుగా పరిగణించాడు. ఆయన సెప్టువజింట్‌లోని మాటలను ఉపయోగించుకొనుచు, యెషయా 6:9, 10లో గల వాక్యభాగమును ఉల్లేఖించి చెప్పాడు (యోహాను 12:39–41; అపొస్తలుల కార్యములు 28:25–27 చూడు).

వారు **వినుచుండినను, గ్రహించకుండిరి**; వారు **చూచుచుండినను, తెలిసికొనకుండిరి**. (ప్రవచించుటకు యెషయా కివ్వబడిన సందర్భములో అగుపించుచున్న) అసలు ఘోషణ యెషయా కాలము నాటి ప్రజలను వర్ణించుచుండినను, అది నిశ్చయముగా యేసు మాట

లాడుచుండిన ప్రజలకు వర్తించినది. వారు దేవుని వాక్యమును పలుమార్లు విన్నారు, కాని విని విని విసుగెత్తినవారుగా దాని సందేశమును గ్రహించుటకు వారి మనస్సులను తెరవకపోవుట సమస్యయై యుండెను. వారు సత్యమును వినకుండునట్లు **వారి చెవులను**, దాని అర్థమును తెలిసికొనకుండునట్లు **వారి కన్నులను మూసికొన్నారు.** వారు దేవునికి విరోధముగా చేయుచుండిన తిరిగుబాటు వలన దేవుడు వారిని క్షమించడాయెను.

**వచనము 16.** కూడి యుండిన జనసమూహములకు తారతమ్యముగా, ఆధ్యాత్మిక సత్యములను అర్థంచేసికొనుటకు శిష్యులు సంసిద్ధులై యుండిరి. తత్ఫలితంగా, యేసు వారిని ఈ విధంగా ఆశీర్వదించాడు: **అయితే మీ కన్నులు చూచుచున్నవి, గనుక అవి ధన్యములైనవి; మీ చెవులు వినుచున్నవి, గనుక అవి ధన్యములైనవి**, వారి హృదయములు గ్రహణ శీలముగలవై యుండుటనుబట్టి, వారు యేసు నివేదించుచుండిన సత్యములను వినగలిగిరి మరియు గ్రహించగలిగిరి. ఏదిఏమైనా, కొన్ని పర్యాయములు వారు విషయములను అర్థంచేసికొనుటలో మందమతులై యుండిరి (15:15, 16).

**వచనము 17.** పాత నిబంధన **ప్రవక్తలు** అనేక ప్రాముఖ్యమైన భవిష్యత్ సంఘటనల గూర్చి ముందుగా ప్రవచించారు, కాని వారు ప్రవచించుచుండిన విషయములన్నిటిని వారు గ్రహించారనునది సందేహమే. ఉదాహరణ దర్శనమందు ఆయనకు చూపింపబడిన దానినిబట్టి దానియేలు ఆశ్చర్యచకితుడయ్యాడు (దానియేలు 9:1–27), గనుక ఆయన దేవుని ప్రార్థించాడు. దానియేలు చేసిన ప్రార్థనకు ప్రత్యుత్తరముగా, అతనికి "గ్రహింప శక్తి" నిచ్చుటకు గబ్రియేలు పంపబడెను (దానియేలు 9:22). ఈ సమయంలో శిష్యులు అనుభవించుచుండిన విషయములను వారు **చూడవలెననియు**, **వినవలెననియు** ప్రవక్తలు ఎంతో ఆశించిరి. పేతురు ఇలా వ్రాయుచున్నాడు,

> మీకు కలుగు ఆ కృపనుగూర్చి ప్రవచించిన ప్రవక్తలు ఈ రక్షణనుగూర్చి పరిశీలించుచు, తమయందున్న క్రీస్తు ఆత్మ క్రీస్తు విషయమైన శ్రమలనుగూర్చియు, వాటి తరువాత కలుగబోవు మహిమలనుగూర్చియు ముందుగా సాక్ష్యమిచ్చునపుడు, ఆ ఆత్మ, యే కాలమును ఎట్టి కాలమును సూచించుచువచ్చెనో దానిని విచారించి పరిశోధించిరి. పరలోకమునుండి పంపబడిన పరిశుద్ధాత్మవలన మీకు సువార్త ప్రకటించినవారిద్వారా మీకిప్పుడు తెలుపబడిన యీ సంగతులవిషయమై, తమకొరకు కాదు గాని మీకొరకే తాము పరిచర్య చేసిరను సంగతి వారికి బయలు పరచబడెను; దేవదూతలు ఈ కార్యములను తొంగిచూడగోరుచున్నారు (1 పేతురు 1:10–12).

యేసు బోధించిన ఉపమానములు మరియు ఇతర ఉపదేశముల ద్వారా, ప్రవక్తలకు బయలుపరచబడని సత్యములను అపొస్తలులు నేర్చుకొనుచుండిరి. ఎట్టికేలకు, సంఘ స్థాపన "దేవుని నానావిధమైన జ్ఞానము" దూతలకు బయలుపరచినది (ఎఫెసీయులకు 3:8–12). ("ప్రవక్తలను" **నీతిమంతులైన వారితో** జతచేయడము గూర్చి 10:41పై గల వ్యాఖ్యానము చూడు.)

### ఉపమానము–దాని వివరము (13:18–23)

**18-19 విత్తువాని గూర్చిన ఉపమాన భావము వినుడి. ఎవడైనను రాజ్యమును గూర్చిన వాక్యము వినియు గ్రహింపక యుండగా, దుష్టుడు వచ్చి వాని హృదయములో**

**విత్తబడినదానిని యెత్తికొనిపోవును; త్రోవప్రక్కను విత్తబడినవాడు వీడే. [20]రాతి నేలను**
**విత్తబడినవాడు వాక్యము విని వెంటనే సంతోషముతో దాని నంగీకరించువాడు. [21]అయితే**
**అతనిలో వేరు లేనందున అతడు కొంతకాలము నిలుచును గాని, వాక్యము నిమిత్తము**
**శ్రమయైనను హింసయైనను కలుగగానే అభ్యంతర పడును. [22]ముండ్లపొదలలో**
**విత్తబడినవాడు వాక్యము వినువాడే గాని ఐహికవిచారమును ధనమోసమును ఆ వాక్యమును**
**అణచివేయును గనుక వాడు నిష్ఫలుడవును. [23]మంచి నేలను విత్తబడినవాడు వాక్యము విని**
**గ్రహించువాడు; అట్టివారు సఫలులై యొకడు నూరంతలుగాను ఒకడు అరువదంతలుగాను**
**ఒకడు ముప్పదంతలుగాను ఫలించుననెను.**

**వచనము 18**. యేసు, **విత్తువాని ఉపమానము** గూర్చి తన శిష్యులకు ఏకాంతముగా వివరించాడు (13:10పై గల వ్యాఖ్యానము చూడు). వారు ఖచ్చితముగా వినవలసి యుండిన అవసరమును ఆయన నొక్కివక్కాణించాడు; **వినుడి** అని మామూలుగా చెప్పుటకు బదులుగా, "మీరు వినుడి" అని గ్రీకు గ్రంథ పాఠము సెలవిచ్చుచున్నది. నిర్మొహమాటమైన మనస్సులు గలవారైనప్పుడు, వారు గ్రహించగలుగుదురు.

ఈ ఉపమానములోని విత్తువాడు ఎవరు? దీనికి మొట్టమొదటి జవాబు, "యేసు." ఇదే అధ్యాయములో అటుతరువాత మనము చూడగల గురుగుల గూర్చిన ఉపమానములో, యేసు, "మంచి విత్తనము విత్తువాడు మనుష్యకుమారుడని" సెలవిచ్చాడు (13:37). రాజ్యము యొక్క తొలి విత్తనమును వ్యాపింపజేసినది ఆయనే. అట్లయినప్పటికిని, ఆయన తన శిష్యులకు పరిమితమైన అధికారముతో కూడిన కార్యభారమును అప్పగించి వారిని లోకములోనికి పంపించాడు మరియు చివరకు "మీరు సర్వలోకమునకు వెళ్లి సర్వ సృష్టికి సువార్తను ప్రకటించుడని" వారికి తన ఆదేశమును జారీ చేసాడు (మార్కు 16:15). కాబట్టి, విత్తువాడు అను పదము శుభ సందేశమును వ్యాపింపజేయుటలో నిమగ్నమై యున్న ఏ శిష్యునినైనా సూచింపవచ్చును.

ఈ ఉపమానములో పేర్కొనబడిన విత్తనమును ఎలా దృష్టించవలెను? మత్తయి వ్రాసిన సువార్త దీనిని "రాజ్యమును గూర్చిన వాక్యము" అని పేర్కొనుచుండగా (13:19–23), లూకా వ్రాసిన సువార్త ఇదే మాటను, "విత్తనము దేవుని వాక్యము" అని చెప్పుచున్నది (లూకా 8:11).

ఈ ఉపమానములోని నేలలు ప్రధానాంశములై యున్నవి. అవి వేర్వేరు విధములైన శ్రోతలకు లేక హృదయములకు చిహ్నములై యున్నవి. ఈ ఉపమానము, "విత్తువాని గూర్చిన ఉపమానము" అని సంబోధింపబడుచున్నప్పటికిని, కథలోని అసలన వక్కాణింపు విత్తనములను తీసికొను నేలలపై కలదు. విత్తబడిన వాక్యము వేర్వేరు స్థాయిలలో అంగీకరింపబడుచున్నది గనుక తత్ఫలితమైన ప్రతిస్పందనలు కూడ నానావిధములుగా నున్నవి.

**వచనము 19.** మొదటిది, విత్తనము **త్రోవ ప్రక్కన పడిన విత్తనము** (13:4 చూడు). అది సాగుబడి నిమిత్తము సిద్ధముచేయబడని మరియు గట్టిబడిన నేలయై యుండెను గనుక విత్తనము నేల లోతుల్లోనికి చొచ్చుకొనిపోలేకపోయినది. వాటి ఆహారము కొరకు వేటాడుచుండు పక్షుల దృష్టిని ఆకర్షించునట్లు అది నేల పై భాగములోనే పడియుండెను,

గనుక అది త్వరలోనే పక్షులకు అనువైన ఆహారమయ్యింది. విత్తనము మంచిదై యుండెను, గనుక సమస్య విత్తనములో లేదు, సమస్య ఉన్నదంతా నేలలోనే. ఈ నేల **రాజ్య వాక్యమును వినుట మట్టుకు విందురు గాని గ్రహింపనివారిని** సూచించుచున్నది. వీరు ఒక పక్షి వలె (13:4), వాక్యమును గ్రహించరు, ఏలయనగా **ఆ విత్తనము వేళ్లూనక మునపే దుష్టుడు వచ్చి దానిని ఎత్తుకొనిపోవుచుండెను.**

"దుష్టుడు" అను మాట ఎటువంటి సందేహమైనను లేకుండా, సాతానునే సూచించుచున్నది. వాడు పరిశుద్ధ బైబిల్‌కు వెలుపల యూదుల సాహిత్యములో వ్యధను కలిగించునట్టి పక్షులతో పోల్చబడినాడు. ఒకానొక సందర్భములో, వాటి కోత మానవులకు దక్కకుండా అది అపహరింపబడునట్లు "ఇహ లోకములో విత్తబడిన విత్తనములను తినివేయుటకు" వాడు పక్షులను పంపించాడని చెప్పకొనబడుచున్నది. "విత్తనము నేల లోపలికి వెళ్లునట్లు వారు దున్నక మునపే, కాకులు వచ్చి విత్తబడిన విత్తనములను నేల ఉపరితలము నుండి ఎత్తికొనిపోయినవి."[5]

మనుష్యుల హృదయములలో విత్తబడుచుండు దేవుని వాక్యమును హఠత్తుగా ఎత్తుకొనిపోవుటకు అపవాది అనేక విధానములను కలిగియున్నాడు. ఒక భిన్నమైన రూపకాలంకారమును ఉపయోగించుచు, "దేవుని స్వరూపియై యున్న క్రీస్తు మహిమను కనుపరచు సువార్త ప్రకాశము వారికి ప్రకాశింపకుండు నిమిత్తము, ఈ యుగ సంబంధమైన దేవత అవిశ్వాసులైనవారి మనో నేత్రములకు గ్రుడ్డితనము కలుగజేసెనని" పౌలు అపవాది గూర్చి చెప్పుచున్నాడు (2 కొరింథీయులకు 4:4). సాతాను యొక్క వక్ర విధానముల విషయములో దేవుని ప్రజలు అజ్ఞానులై యుండకూడదు (2 కొరింథీయులకు 2:11; ఎఫెసీయులకు 4:27; 2 తిమోతి 2:26; 1 పేతురు 5:8; 1 యోహాను 2:14-17).

**వచనములు 20, 21.** రెండవది, కొన్ని విత్తనములు **మన్నులేని రాతినేలను పడినవని** యేసు వివరించాడు (13:5 చూడు). ఈ నేల, వాక్యము విని వెంటనే విని **వెంటనే సంతోషముతో దానిని అంగీకరించువానిని చిత్రీకరించుచున్నది.** అట్లయినప్పటికిని, ఈ విత్తనము త్వరలోనే తన జీవాన్ని కోల్పోతుంది ఏలయనగా, వాక్యము నిమిత్తము **శ్రమయైనను హింసయైనను కలుగగానే** ఇటువంటివాడు **అభ్యంతరపడును.** "అభ్యంతరపడును" అని చెప్పటకు బదులుగా, "ఎంతో ఎక్కువ కాలము నిలిచే స్తోమత అతనిలో లేదని" REB అనువాదము చెప్పుచున్నది. అట్టివాడు "కొంచెము కాలము నమ్మునని" లూకా 8:13 చెప్పుచున్నది. ఇటువంటి శ్రోతలతో వచ్చిన ప్రధాన చిక్కేమిటంటే వారి ఒప్పింపు లోతైనది కాదు. వేరు లోతుల్లోనికి వెళ్లకుండా లేక **వేరు స్థిరమైనదిగా లేనట్లయితే,** అతడు త్వరలోనే విశ్వాసభ్రష్టుడగును. మండుటెండ చేత సూచింపబడుచున్నట్లు (13:6), శ్రమయైనను లేదా హింసయైనను కలుగునను తొలి సంకేతముతోనే, వాడు ఎండిపోవును. ఇది "ఆసక్తి నెమ్మది నెమ్మదిగా కోల్పోబడుట కాదు, కాని ఒత్తిడి చేత ఏకంగా కూలిపోవుట యే" అని R. T. ఫ్రాన్స్ చెప్పుచున్నాడు.[6]

**వచనము 22.** మూడవది, **కొన్ని విత్తనములు ముండ్ల పొదలలో పడెను** (13:7). వీరు దేవుని వాక్యము వింటారు కానీ **ఐహిక విచారము మరియు ధనమోసము చేత ఆ వాక్యమును అణచివేయబడు** వారిని ఈ నేల చిత్రీకరించుచున్నది. తత్ఫలితంగా, వారి ఆధ్యాత్మిక జీవితములు **నిష్ఫలమౌను.** ఇటువంటి వారు "పరిపక్వముగా ఫలింపనివారని" యేసు

చెప్పినట్లు లూకా వ్రాయుచున్నాడు (లూకా 8:14). "ఐహిక విచారములు" మరియు "ధనమోసము" అను ఈ రెండు అంశములను కలిపి యేసు కొండ మీద చేసిన ప్రసంగములో చర్చించాడు (మత్తయి 6:19–34). తాత్కాలికమైన ఈ లోక విషయములు, నిరంతరము నిలచియుండు విషయాల నుండి వారి మనుస్సుల దిశానిర్దేశనమును మళ్లించుటను క్రీస్తు అనుచరులు అనుమతింపకూడదు. జీవిత సమస్యల చేత ముంచెత్తబడి ధనము వెంటబడుట అతి సులువు. ధనము మోసకరమైనది ఏలయనగా, అది తానివ్వగల సంతృప్తిని మించిన దానిని వాగ్దానము చేయుచు ప్రజలు దేవుని, అనగా సకల సిరిసంపదలకు మూలాధారమైన దేవుని మరచిపోవువట్లు చేయును (ద్వితీయోపదేశకాండము 8:11–20; సామెతలు 30:7–9; ప్రసంగి 2:4–11; లూకా 12:13–34; 1 తిమోతి 6:17–19; హెబ్రీయులకు 13:5, 6).

**వచనము 23.** నాలుగవది, **కొన్ని మంచి నేలను పడెను** (13:8 చూడు), ఇది **వాక్యము విని దాని గ్రహించువానిని** సూచించుచున్నది. "వీరు యోగ్యమైన మంచి మనస్సుతో వాక్యము విని దానిని అవలంబించి ఓపికతో ఫలించువారని" యేసు వీరిని వర్ణించాడు (లూకా 8:15). ఇటువంటి శ్రోతలు "వాక్యమును" విని దానిని గ్రహించుట మాత్రమే కాదు, కానీ ఆ వాక్యము వారి హృదయాలలో దాని వేరును లోతుగా తన్నుకొనునట్లు అనుమతించుదురు. వారిలో ఆధ్యాత్మిక లోతు మరియు స్థిరత్వముకలదు. వారికి ఇహలోక కష్టనష్టములు కలిగినను వారు కదలనివారుగా నిలచియుందురు. వారు ధనాపేక్షను ఎదిరించుదురు ఏలయనగా అసలు సిసలైన సిరిసంపదల విలువ వారికి తెలియును (హెబ్రీయులకు 11:24–26 చూడు).

విశ్వసనీయమైనవారుగా నిలచియుండు విశ్వాసులు **ఫలించెదరు**. ఆవశ్యకమై యుండిన ఆధ్యాత్మిక సహనము గూర్చి యేసు ఉద్ఘాటించి చెప్పాడు: "వీరు వాక్యము విని దానిని అవలంబించి ఓపికతో ఫలించువారు" (లూకా 8:15). హెచ్చుతగ్గులుగా నున్న దిగుబడులు, **ఒకటి నూరంతలుగాను, ఒకటి అరువదంతలుగాను, ఒకటి ముప్పదంతలుగాను** ఫలించుట, విశ్వాసుల ఉత్పాదకమైన సేవను ప్రతిబింబించుచున్నది. "ఎవడు నాయందు నిలిచియుండునో నేను ఎవని యందు నిలిచియుందునో, వాడు బహుగా ఫలించును, ఏలయనగా నాకు వేరుగా ఉండి మీరేమియు చేయలేరని" యేసు సెలవిచ్చెను (యోహాను 15:5). క్రైస్తవ విశ్వాసులు "దేవుని కొరకు ఫలించునట్లు" క్రీస్తునకు వివాహము చేయబడినవారై యున్నారనునది పౌలు సాదృశ్యమై యున్నది (రోమా 7:4). వివాహ సంబంధము యొక్క ఫలితము, సంతానము. క్రీస్తునకు వివాహము చేయబడినవారు దేవుని కొరకు పిల్లలను కనవలెను. క్రైస్తవులు ఇతరమైన ఫలము కూడ ఫలించుదురు (గలతీయులకు 5:22, 23). ఒకడు ఫలించని యెడల, ఫలించక ఎండిపోయిన తీగలు అగ్నిలోనికి పారవేయబడినట్లు వాడు బయట పారవేయబడును (యోహాను 15:6 చూడు).

క్రైస్తవులు వాక్యమును విత్తువారై ఉండాలి, ఫలితము కొరకు ప్రార్థించాలి. మనం విత్తనం విత్తిన తర్వాత దేవుడు తన పనిని చేయునని ఓపికతో ఉండాలి.

## రాజ్యము యొక్క విత్తనములు విత్తుట (13:1-9, 18-23)

ఆయన అనుచరులు సువార్తమానమును లోకమునకు తీసికొని వెళ్లగలుగుటకు ఒక మార్గమును విత్తువాని గూర్చి ఆయన చెప్పిన ఉపమానములో యేసు మన కొరకు సమకూర్చాడు. మంచి సాంద్రతగలదై యున్న విత్తనముపై ధ్యానమును కేంద్రీకరించుట మంచిదే, కానీ అది "వెదజల్లబడినంత" గా" సార్థకమైనదై యుండదు. మనము విత్తనమును వెదజల్లుచు విస్తారముగా విత్తినట్లయితే, అప్పుడది చాలినంతగా మంచి నేలలో లేక నిజాయితీపరులైన వారి హృదయాల్లో పడి, ప్రభువు కొరకు విస్తారమైన పంట పండునను నిశ్చయత నిచ్చును. మనము విత్తనము నాటి దానికి నీరు పోసినట్లయితే, దాని దిగుబడికి మనము బాధ్యులము కాము. "నేను నాటితిని, అపోల్లో నీళ్లు పోసెను, వృద్ధికలుగజేసినవాడు దేవుడే" అని పౌలు చెప్పుచున్నాడు (1 కొరింథీయులకు 3:6). "నా ... వచనము నిష్ఫలముగా నా యొద్దకు మరలక, అది నాకు అనుకూలమైన దాని నెరవేర్చును, నేను పంపిన కార్యమును సఫలము చేయునని" కూడ దేవుడు మనకు వాగ్దానమిచ్చాడు (యెషయా 55:11).

ప్రతి విధమైన విత్తనము దాని దాని సొంత జాతి ప్రకారము ఫలించునని విత్తుట మరియు పంటకోయుట గూర్చిన దేవుని నియమము మనకు తెలియజెప్పుచున్నది (ఆదికాండము 1:11, 12). మనము ఒక నిర్దిష్టమైన విత్తనమును నాటినప్పుడు, అది దాని జాతి ప్రకారమైన ఫలమునే ఇచ్చునని మనమెరుగుదుము. భౌతిక ప్రపంచంలో వాస్తవమైనదే, ఆధ్యాత్మిక ప్రపంచంలో కూడ వాస్తవమై యున్నది (గలతీయులకు 6:7-9 చూడు). ఆధ్యాత్మిక విత్తనము విత్తబడినప్పుడు, మనము ఆధ్యాత్మిక ఫలమును కోయుదుము. దేవుని వాక్యమును మంచి నాణ్యతగల విత్తనము విత్తబడినప్పుడు, అది కేవలము క్రైస్తవులను మాత్రమే కలుగజేయును.

నియమ ప్రకారము అంగీకరింపబడకపోయినప్పటికిని ఆచరణలో, "వెళ్లుడి, నేర్పించుడి, బాప్తిస్మమియ్యుడి, మరియు మరి ఎక్కువ బోధించుడని" యేసు సెలవిచ్చాడు (మత్తయి 28:18-20 చూడు). ఇతరుల ఆధ్యాత్మిక లోతునకు మనము బాధ్యులము కాము, కానీ వారి హృదయాల్లో వాక్యమను విత్తనము నాటుటకు ప్రయత్నించవలసిన బాధ్యత మనపై ఉన్నది. యేసు అదే చేసాడు (7:29; మార్కు 1:27), గనుక పౌలు దానినే ఆజ్ఞాపించాడు (1 తిమోతి 4:16; 2 తిమోతి 3:16-17).

## వెవ్వేరు విధములైన నేలలు (13:1-9, 18-23)

యేసు చెప్పిన ఉపమానమునకు వలెనే, ఈ రోజుల్లో విత్తబడుచున్న సువార్త యను విత్తనము, నేలలనబడు వెవ్వేరు హృదయాల్లో పడుచున్నది. ఈ నేలలు నానా విధములైన శ్రోతలను మరియు దేవుని వాక్యము యెడల వారు ప్రదర్శించు ప్రతిస్పందనలను సూచించుచున్నవి.

*గట్టి నేల (త్రోవ).* సువార్త యనబడు విత్తనము కఠినమైన కొందరి హృదయాల లోతుల్లోనికి వేరూనదు. దేవుని పరిశుద్ధతను, వారు చేయు పాపము మరియు దాని

ఫలితమును గూర్చిన వాస్తవమును, యేసు క్రీస్తు యొక్క బలియాగము, మరియు ముందున్న నిశ్చయమైన తీర్పును వారు గ్రహించరు. కాబట్టి, సువార్త వారికి వెర్రితనముగా నున్నది.

*రాతి నేల.* ఇతరులు సువార్తను ఎంతో సంతోషముతో వెంటనే అంగీకరిస్తారు; కాని వ్యతిరేకత ఎదురైనప్పుడు, వారు ఆధ్యాత్మికముగా అంతలోనే ఎండిపోయి, నిష్ఫలులగుదురు. వారు క్రీస్తును వదిలిపెట్టి మరలా లోకము వైపు తిరుగుదురు.

*ముండ్ల పొదలు.* వీరు సువార్త సందేశమును సహృదయంతో అంగీకరించువారు, అయితే వారి ఆధ్యాత్మిక ఫలము వారి ఐహిక జీవితములో ఎదురయ్యే "ముండ్ల" చేత అణచివేయబడవచ్చును. ఈ నాడు అనేక మంది క్రైస్తవులు ఈ కోవకు చెందియున్నారు. వారి జీవితములు ఉద్యోగముల గూర్చిన ఆలోచనలు మరియు వ్యక్తిగత ఆశల చేత నిండియున్నవి గనుక ఆధ్యాత్మిక విషయాల గూర్చి ఆలోచించుటకు వారికి సమయమును లేదు. ప్రార్థన, బైబిలు అధ్యయనము, సంఘూరాధనలకు హాజరగుట, తోటి విశ్వాసులను సందర్శించుట, వ్యక్తిగత సౌవార్తీకరణము, మరియు పరులకు ఉపచారం చేయుట మొదలగు కార్యకలాపములకు తావు లేదు. తత్ఫలితంగా వారు యజమానుని కొరకు ఫలించేది అతి తక్కువే.

*మంచి నేల.* వీరు దేవుని యెడల సున్నితమైన హృదయములు గలవారై, సువార్తను సంతోషముతో అంగీకరించుదురు. ఆధ్యాత్మిక క్రమశిక్షణలో విశ్వసనీయముగా నిమగ్నులగుట ద్వారా, వారు బలమైన క్రైస్తవ వేళ్లను స్థాపించుకొందురు, గనుక వారు సరైన రీతిలో ఎదుగునట్లు అవి వారికి తోడ్పడును.

*ముగింపు.* ప్రతి ఒక్కరు, "నేనెటువంటి నేలనై యున్నాను?"; "రాజ్యములో యింకా ఎక్కువగా ఫలించునట్లు నేను ఏ యే విషయాలలో మారవలసి యున్నది?" అని తనను తాను ప్రశ్నించుకొనవలసిన అవసరత ఎంతైనా ఉన్నది.

డేవిడ్ స్టూవర్ట్

---

సూచనలు

[1]Michael J. Wilkins, "Matthew," in *Zondervan Illustrated Bible Backgrounds* Commentary, vol. 1, *Matthew, Mark, Luke,* ed. Clinton E. Arnold (Grand Rapids, Mich.: Zondervan, 2002), 82. [2]Craig S. Keener, *A Commentary on the Gospel of Matthew* (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1999), 377. [3]దాని సారవంతమైన గుణమునుబట్టి జోసీఫస్ కపెర్నహూము చుట్టుప్రక్కల నుండిన నేలను ప్రశంసించాడు. (Josephus *Wars* 3.10.8.) [4]*Sibylline Oracles* 3.263-64; *Jubilees* 24.15. [5]*Jubilees* 11.10, 11; Talmud *Sanhedrin* 107a చూడు. [6]R. T. France, *The Gospel According to Matthew,* The Tyndale New Testament Commentaries (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1985), 219.